ప్రత్యేక పూజలు

సనత్‌నగర్: సికింద్రాబాద్ మహంకాళి అమ్మవారి ఆలయంలో లలితా పారాయణ మహిళలు శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. మల్లెపూలు, కుంకుమార్చన, మామిడి పండ్లతో అభిషేక మహోత్సవాన్ని నిర్వహించారు. రాంగోపాల్‌పేట కార్పొరేటర్ చీర సుచిత్రాశ్రీకాంత్, అశ్విని, నిర్వాహకురాలు రాజశ్రీ తదితరులు పూజల్లో పాల్గొన్నారు.

బీసీలకే టీపీసీసీ అధ్యక్ష పదవి ఇవ్వాలి

ఉస్మానియా యూనివర్సిటీ: టీపీసీసీ అధ్యక్షత పదవిని బీసీ నాయకులకు ఇవ్వాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి రాహుల్ గాంధీకి మెయిల్ ద్వారా విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. తెలంగాణలో సగానికి పైగా ఉన్న బీసీలకు పదవి ఇస్తే రాష్ట్రంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు.

చెట్ల కొమ్మల తొలగింపు

లాలాపేట: తార్నాక మున్సిపల్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ వైర్లకు, స్ట్రీట్ లైట్స్‌కు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను జీహెచ్‌ఎంసీ అధికారులు శుక్రవారం తొలగించారు. లాలాపేట, ఇందిరానగర్ తదితర ప్రాంతాల్లో తొలగింపు పనులు చేపట్టారు ఈ సందర్భంగా స్థానిక సోషల్ వర్కర్ నేతికార్ మహేశ్ మాట్లాడుతూ చెట్ల కొమ్మలు పెరిగి విద్యుత్ వైర్లకు తాగి ప్రమాదకరంగా మారాయని సంబంధిత అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఎట్టకేలకు స్పందించి చర్యలు తీసుకోవడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు.

పారిశుద్ధ్య సిబ్బందితో సమావేశం

బౌద్ధనగర్: బౌద్ధనగర్‌లోని వార్డు కార్యాలయంలో కార్పొరేటర్ కంది శైలజ పారిశుద్ధ్య సిబ్బందితో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెత్తాచెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగించి ప్రజలకు ఇబ్బందుల్లేకుండా చూడాలన్నారు. ప్రజలు కూడా ఇండ్ల ముందుకు వచ్చే చెత్త తరలింపు ఆటోల్లోనే చెత్త వేయాలన్నారు. ఏఎంసీ ఒమర్, శానిటేషన్ జవాన్ రాజు, ఎంటమాలజీ సూపర్‌వైజర్ చంద్రశేఖర్, ఎస్ఎఫ్ఏలు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

బన్సీలాల్‌పేట్: సామాజిక ఉద్యమకారుడు కె. రాజెల్లయ్య జ్ఞాపకార్థంగా బన్సీలాల్‌పేట్ డివిజన్ చాచానెహ్రూనగర్ కమ్యూనిటీహాల్‌లో పేద విద్యార్థులకు పుస్తకాలు, స్టేషనరీని శుక్రవారం అందజేశారు. సికింద్రాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ బీజేపీ సమన్వయకర్త టి. రాజశేఖరరెడ్డి, బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి జి. స్పందన, జి. రమేశ్, నాయకులు వై. సురేశ్, శ్రీనివాస్, కృష్ణ, ఈశ్వర్‌బాబు, షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు డి. సుదర్శన్‌బాబు, మహేందర్ పాల్గొన్నారు.

ఓల్డ్‌కస్టమ్స్‌బస్తీ పాఠశాలలో..

సనత్‌నగర్: బేగంపేట ఓల్డ్‌కస్టమ్స్‌బస్తీ ప్రభుత్వ పాఠశాలలో బేగంపేట కార్పొరేటర్ మహేశ్వరి విద్యార్థులకు శుక్రవారం పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు మంచిగా చదువుకుని ఉన్నత స్థానానికి చేరుకోవాలని ఆకాంక్షించారు.

ప్రాథమిక పాఠశాలలో 'బడిబాట'

అడ్డగుట్ట: అడ్డగుట్టలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సికింద్రాబాద్ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆదం సంతోష్‌కుమార్ హాజరై విద్యార్థులకు స్కూల్ యూనిఫాంలు, పాఠ్య పుస్తకాలు పంపిణీ చేసి వారితో అక్షరాభ్యాసం చేయించారు. నాయకులు గంట రాజుసాగర్, నాగభూషణం, జాఫర్, కొమరమ్మ, అనంత కృష్ణారావు, భూపతి హరి, ప్రభాకర్, నవీన్, రాములు పాల్గొన్నారు.

జీహెచ్‌ఎంసీ అలర్ట్..!

జీహెచ్‌ఎంసీ ఉత్తర మండల అధికారుల అప్రమత్తం

- వర్షాకాలం నేపథ్యంలో ముందస్తు చర్యలు
- రంగంలోకి ప్రత్యేక బృందాలు
- ప్రమాదకర వృక్షాల తొలగింపు
- విద్యుత్ స్తంభాల గుర్తింపు

సికింద్రాబాద్: నగరంలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జీహెచ్‌ఎంసీ ఉత్తర మండల అధికారులు అలెర్ట్ అయ్యారు. భారీ వర్షాలు కురిసినప్పటికీ ముంపు సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు ముందస్తు చర్యలను శుక్రవారం ప్రారంభించారు. జీహెచ్‌ఎంసీ ఉత్తర మండలం పరిధిలోని ఐదు సర్కిళ్లలో వర్షాకాలం నేపథ్యంలో రక్షణ చర్యలు తీసుకునేందుకు ఆయా సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్లను అప్రమత్తం చేశామని, అలాగే అత్యవసర సహాయక చర్యల కోసం అవసరమైన వాహనాలను అందుబాటులోకి ఉంచామని జోనల్ కమిషనర్ రవికిరణ్ తెలిపారు. ముఖ్యంగా వరద ఉధృతి పెరగడం, నాలాలు పొంగడం, స్తంభాలు, చెట్లు నేలకూలడం వంటి సందర్భాల్లో అత్యవసర వాహనాలను రంగంలోకి దింపుతామని అధికారులు పేర్కొంటున్నారు. సహాయక చర్యలకు అవసరమైన పనిముట్లు, సుశిక్షితులైన సిబ్బందితో కూడిన వాహనాలను మున్సిపల్ డివిజన్‌కు ఒకటి చొప్పున అందుబాటులో ఉంచారు. ముఖ్యంగా భారీ, ఏకధాటిగా వర్షాలు కురిసిన సందర్భాల్లో వరద నీరు సాఫీగా బయటకు వెళ్లేలా ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. ప్రమాదకరంగా ఉన్న వృక్షాలు, విద్యుత్‌స్తంభాలను గుర్తించి తొలగిస్తున్నారు. జీహెచ్‌ఎంసీ సికింద్రాబాద్ జోనల్ కార్యాలయం పరిధిలోని సికింద్రాబాద్, బేగంపేట్, మల్కాజిగిరి, ముషీరాబాద్, అంబర్‌పేట్ ఐదు సర్కిళ్ల పరిధిలో అన్ని ప్రభుత్వ విభాగాల అధికారులతోనూ కొద్దిరోజుల్లో సమన్వయ కమిటీ సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు జోనల్ కమిషనర్ తెలిపారు. ముంపు తదితర ప్రమాదకర పరిస్థితులు ఎదురైన సందర్భాల్లో తక్షణ చర్యలు చేపట్టేందుకు అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేసేలా సమావేశంలో నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు.


ప్రమాదకర వృక్షాల తొలగింపును సమీక్షిస్తున్న జడ్‌సీ రవికిరణ్

ప్యాంక్రియాటిక్ ట్యూమర్ తొలగింపు

అమీర్‌పేట: ప్యాంక్రియాటిక్ ప్రాంతంలో ఏర్పడిన ట్యూమర్‌ను మెడికవర్ ఆసుపత్రి వైద్యులు శస్త్ర చికిత్స చేసి తొలగించారు. గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ శ్రీమన్నారాయణ యర్రారపు అమీర్‌పేటలోని హాస్పిటల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను వెల్లడించారు. 45 ఏళ్ల ఓ మహిళ పొత్తి కడుపు నొప్పితో మెడికవర్ ఆసుపత్రికి వచ్చింది. సిటీ స్కాన్ చేయగా ప్యాంక్రియాటిక్ ప్రాంతంలో సాలిడ్ సుడోపపిల్లరీ ఎపిథీలియల్ నియోప్లాజమ్ స్పెన్ అనే అరుదైన ప్యాంక్రియాటిక్ ట్యూమర్ (కణతి) ఉన్నట్లు నిర్ధారించారు. ప్యాంక్రియాటికోడ్యుడెనెక్టమీ చేయాలని నిర్ణయించి శ్రీమన్నారాయణ నేతృత్వంలో వైద్య నిపుణుల బృందం 4 గంటలు శ్రమించి విజయవంతంగా కణతిని తొలగించారు. కణతి సైజు 10 ప్లస్ 6 సెంటీమీటర్లు ఉందని తెలిపారు. ఆపరేషన్ అనంతరం రోగి 3 రోజుల్లో కోలుకోగా 5 రోజుల్లో డిశ్చార్జ్ చేశామన్నారు. సహకరించిన వైద్యులు, సిస్టర్లను ఆయన అభినందించారు.

రహదారిపై ఆదమరిచి నడిస్తే ప్రాణాలకే ప్రమాదం

అమీర్‌పేట: రహదారిపై ఆదమరిచి నడిస్తే ప్రాణాలకే ప్రమాదమని బేగంపేట ట్రాఫిక్ ట్రెనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఏసీపీ జి.శంకర్‌రాజు అన్నారు. అమీర్‌పేట గ్రీన్ పార్క్ హోటల్ సిబ్బందికి 'రోడ్డు ప్రమాదాలు, నివారణ' అనే అంశంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శుక్రవారం అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌లో 2023లో రాంగ్ రూట్లో డ్రైవింగ్ చేసినందుకు 523 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే గతంలో కేవలం రూ.500 జరిమానా ఉండేదని, ప్రస్తుతం రూ.5 వేల వరకు విధించడంతో పాటు 3 నెలల వరకు జైలు శిక్ష పడే అవకాశముందన్నారు. 2023లో 2370 ప్రమాదాలు జరగగా అందులో 280 మంది చనిపోయారని, వీరిలో 121 మంది పాదచారులు ఉన్నట్లు తెలిపారు. జాగ్రతగా రోడ్డు దాటాలని సూచించారు. కార్యక్రమంలో హోటల్ సిబ్బంది, ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

ముస్లిం బోర్డు ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు సన్మానం

కంటోన్మెంట్: ఒకటో వార్డు ముస్లిం బోర్డు ఆధ్వర్యంలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్‌ను శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కరోనా సమయంలో మూసేసిన పెన్షన్‌లైన్ నుంచి ఫైజాన్ స్కూల్‌కు వెళ్లే మార్గాన్ని త్వరలోనే తెరపించేలా చూస్తానన్నారు. అలాగే ఒకటో వార్డు పరిధిలో జూనియర్ కాలేజీ ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్, ముస్లిం బోర్డు ప్రెసిడెంట్ హిజ్బల్ షరీఫ్, వైస్ ప్రెసిడెంట్ అతావుల్లా షరీఫ్, సిరాజ్, షఫీ, కాంగ్రెస్ నాయకులు ముప్పిడి మధుకర్, బల్వంత్ రెడ్డి, సదానంద్, జమీల్, అష్రఫ్, బాలరాజు యాదవ్, మారుతి గౌడ్, రవీందర్ గుప్తా, ప్రభు గుప్తా, మహిళా నాయకులు ఫర్హానా, గోమతి, మంజుల తదితరులు పాల్గొన్నారు.

ఓయూ హెల్త్ సెంటర్‌లో సౌకర్యాలు కల్పించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ హెల్త్ సెంటర్‌లో వైద్య సౌకర్యాలు కల్పించాలని ఏబీవీపీ నేత అలివేలి రాజు ఆధ్వర్యంలో రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాస్‌కు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ప్రతి విద్యార్థికి హెల్త్‌కార్డు, రూ.2 లక్షల మెడికల్ ఇన్సురెన్స్, ఆర్టీసీ ఆసుపత్రితో పాటు ఇతర ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స, నిరంతరం అందుబాటులో డాక్టర్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో పేర్కొన్నట్లు వారు తెలిపారు.

ప్రొ.కృష్ణారెడ్డి స్మారక ఉపన్యాసం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పొలిటికల్ సైన్స్ విభాగం ప్రొఫెసర్ కృష్ణారెడ్డి 8వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం స్మారక ఉపన్యాసం జరిగింది. ప్రొ.కృష్ణారెడ్డి శిష్యుడు డాక్టర్ కోట రాజేశ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి విశ్రాంత ప్రొఫెసర్ చెన్నబసవయ్య అధ్యక్షత వహించగా టీజేఎస్ అధ్యక్షుడు ప్రొ.కోదండరామ్ జూమ్ మీటింగ్‌లో లెక్చర్ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ వీసీలు ప్రొ.రవీందర్, ప్రొ.మల్లేశంతో పాటు విద్యార్థులు, అధ్యాపకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గ్రూప్-2, 3 ఉద్యోగాల సంఖ్య పెంచండి

ఉస్మానియా యూనివర్సిటీ: గ్రూప్-2, 3 ఉద్యోగాల సంఖ్య పెంచాలని తెలంగాణ డెమోక్రటిక్ స్టూడెంట్ ఫోరం (టీడీఎస్ఎఫ్) రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు విజయ్ నాయక్ పేర్కొన్నారు. గ్రూప్-2లో 1500, గ్రూప్-3లో 2500 ఉద్యోగాలు పెంచేలా ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకురావాలని కోరుతూ బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు వినతి పత్రం సమర్పించారు. అలాగే గ్రూప్-1 మెయిన్స్‌కు 1:100 ఇచ్చేలా చూడాలని కోరినట్లు పేర్కొన్నారు.

పాత పింఛన్ విధానం అమలు చేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో 2001 నుంచి 2004 వరకు నియమితులైన ఉద్యోగులకు పాత పింఛన్, 2004 తర్వాత నియమితులైన వారికి కాంట్రిబ్యూటరీ పింఛన్ విధానాన్ని అమలు చేయాలని ఎన్జీవోస్ అధ్యక్షుడు బియ్యాని జ్ఞానేశ్వర్ డిమాండ్ చేశారు. ఓయూ నాన్‌టీచింగ్ హోం కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో వివిధ అంశాలపై చర్చించారు. యూజీసీ చట్టాల ప్రకారం నాన్‌టీచింగ్ ఉద్యోగులకు పాలన పదవులు ఇవ్వాలని, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో పాటు వర్సిటీ ఉద్యోగులకు హెల్త్‌కార్డులు అందజేయాలని, పాలక మండలి సభ్యులుగా అవకాశం కల్పించాలని, రాష్ట్ర ప్రభుత్వ సమీక్షా సమావేశాల్లో ఉద్యోగులకు భాగస్వామ్యం కల్పించాలని కోరారు.

బీ కేటగిరి సీట్లను కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేయండి

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలోని వివిధ ఇంజినీరింగ్ కాలేజీల్లో బి కేటగిరి సీట్లను కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేయాలని తెలంగాణ రిపబ్లికన్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు నక్క యాదీశ్వర్, తెలంగాణ రిపబ్లిక్ స్టూడెంట్స్ యూనియన్ రాష్ట్ర కన్వీనర్, ఓయూ ఇన్‌చార్జి బోయ రమేశ్ డిమాండ్ కోరారు. ఈ మేరకు ఇంజినీరింగ్, ఫార్మసీ కాలేజీల్లో 2024–25 విద్యా సంవత్సరానికి బీఈ, బీటెక్, బీఫార్మసీ, ఫార్మడీ ప్రవేశాలను కౌన్సెలింగ్ ద్వారా చేట్టాలని శుక్రవారం రాష్ట్ర ఉన్నత విద్యమండలి చైర్మన్ ప్రొ.లింబాద్రికి వినతి పత్రం అందించినట్లు తెలిపారు. బి కేటగిరి సీట్ల భర్తీ కాలేజీ యాజమన్యాలకు వదిలేయడం ద్వారా లక్షల ఫీజులు వసులు చేస్తూ తక్కువ ర్యాంక్ వచ్చిన అభ్యర్థులకు సీట్లు అమ్ముకుంటున్నారని ఆరోపించారు. ఈ విషయమై సీఎం రేవంత్‌రెడ్డి చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

రక్తదానంపై అవగాహన కల్పించాలి

కిమ్స్ సీఎండీ భాస్కర్‌రావు

సనత్‌నగర్: రక్తదానంపై యువకుల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని కిమ్స్ హాస్పిటల్స్ గ్రూప్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బొల్లినేని భాస్కర్‌రావు అన్నారు. అంతర్జాతీయ రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని సికింద్రాబాద్ కిమ్స్ ఆసుపత్రిలో శుక్రవారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల సరిపడా రక్తం అందుబాటులో లేకపోవడంతో రోగులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కిమ్స్ హాస్పిటల్‌లోని గణాంకాలను పరిశీలిస్తే 30 నుంచి 50 ఏళ్ల వారు అధికంగా రక్తదానం చేస్తున్నారని, కానీ 18 నుంచి 30 ఏళ్ల వరకు ఉన్న యువత కూడా రక్తదానం చేసేందుకు ముందుకురావాలని సూచించారు. బ్లడ్‌బ్యాంక్ విభాగాధిపతి డాక్టర్ కీర్తి మాట్లాడుతూ చాలామంది యువతకు రక్తదానంపై సరైన అవగాహన ఉండడం లేదని ఇందుకోసం కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అనంతరం రక్తదానం చేసిన వారికి జ్ఞాపికలు అందజేశారు.


కిమ్స్ హాస్పిటల్ రక్తదాన శిబిరంలో వైద్యులు

డీఎంహెచ్‌వో కార్యాలయంలో రక్తదానం శిబిరం


జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో శిబిరంలో అధికారులు

సనత్‌నగర్: ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా సికింద్రాబాద్‌లోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటి శిబిరాన్ని ప్రారంభించి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు స్వచ్ఛందగా రక్తదానం చేసి రోగుల ప్రాణాలు కాపాడాలని కోరారు. అనంతరం మలేరియా విభాగం అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ అమర్‌సింగ్ శిబిరాన్ని సందర్శించి రక్తదాతలను అభినందించారు. కాగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయ అధికారులు, సిబ్బంది, జిల్లా లెప్రసీ విభాగం వైద్యులు, సిబ్బంది, మలేరియా సిబ్బంది, పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు, సిబ్బంది దాదాపు 51 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ అనురాధా, జిల్లా మాస్ మీడియా అధికారి జక్కుల రాములు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సునీల్‌కుమార్, ఉప మాస్ మీడియా అధికారి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

లష్కర్ బోనాలను వైభవంగా నిర్వహించాలి


సమావేశమైన దక్కన్ మానవ సేవా సమితి సభ్యులు

సనత్‌నగర్: జులై 21, 22 తేదీల్లో లష్కర్ బోనాల జాతరను ప్రభుత్వం వైభవంగా నిర్వహించాలని దక్కన్ మానవ సేవా సమితి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు జనరల్ బజార్‌లోని సమితి కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యవర్గ సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. జంట నగరాల్లోని ఆలయాలన్నింటికీ ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. అలాగే దక్కన్ మానవ సేవా సమితి నూతన వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కొంకా రఘుమోహన్‌రావును ఎన్నుకున్నారు. నర్సింగ్‌రావు, దయానంద్, విమల్‌కుమార్, రమేశ్, విశాల్ గిరి, వసుంధర మోహన్, కాటారం నర్సింగ్‌రావు, శ్రవణ్‌కుమార్, సత్యనారాయణవర్మ, రాజ్‌కుమార్, హరిబాబు, శ్రీనివాస్, గున్నాల రవికాంత్ పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల్లో బీజేపీ నాయకుల పర్యటన


లాలాపేటలో రోడ్లను పరిశీలిస్తున్న బీజేపీ నేతలు


జోనల్ కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న నేతలు

లాలాపేట: తార్నాక డివిజన్ పరిధిలోని ముంపు ప్రాంతాల్లో బీజేపీ నాయకులు శుక్రవారం పర్యటించారు. శాంతినగర్, ఆర్యనగర్, ఇందిరానగర్, లక్ష్మీనగర్ , వినోభానగర్, మాణికేశ్వర్‌నగర్, పార్థీవాడ తదితర ప్రాంతాల్లో ఇటీవల వర్షాలకు పాడైన రోడ్లను పరిశీలించారు. అలాగే స్థానికుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. తార్నాక డివిజన్ బీజేపీ అధ్యక్షుడు రాము వర్మ ఆధ్వర్యంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి,(కంటెస్టెడ్ ఎమ్మెల్యే) మేకల సారంగపాణి జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో జోనల్ కమిషనర్‌ను కలిసి తక్షణమే రోడ్ల మరమ్మతులు చేపట్టాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వెంకటేశ్‌గౌడ్, వేణుయాదవ్, పోచయ్య యాదవ్, ఉపేందర్, ప్రకాశ్‌గౌడ్, భిక్షపతి, రామకృష్ణ, శ్రీనివాస్‌చారి, కృష్ణమూర్తి, గోవర్ధన్, సతీశ్‌రెడ్డి, ప్రమోద్‌కుమార్, కరుణాకర్ తదితరులు ఉన్నారు.

గాంధీ బ్లడ్ సెంటర్ ఆధ్వర్యంలో 150 యూనిట్ల సేకరణ

గాంధీఆస్పత్రి : ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రిలోని బ్లడ్ సెంటర్ ఆధ్వర్యంలో నగరంలోని పలు ప్రాంతాల్లో రక్తదాన శిబిరాలు నిర్వహించి 150 యూనిట్ల రక్తం సేకరించారు. ఈ సందర్భంగా గాంధీ ఆస్పత్రి బ్లడ్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సత్యరత్న మాట్లాడుతూ నగరంలోని పలు విద్యాసంస్థలు, నర్సింగ్ కాలేజీలు, సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో శిబిరాలు నిర్వహించామన్నారు. వరల్డ్ బ్లడ్ డోనర్స్‌డే సందర్భంగా గాంధీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజారావు, గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రమేశ్‌రెడ్డి, వైద్య ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రక్తదానంపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించేందుకు ర్యాలీలు, చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. గాంధీ బ్లడ్ సెంటర్‌కు రక్తందానం చేసిన దాతలకు సర్టిఫికెట్‌తో పాటు ప్రశంసపత్రాన్ని అందిస్తున్నామని తెలిపారు.



దశలవారీగా హామీల అమలు


డబుల్‌బెడ్రూం పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీ గణేశ్

రసూల్‌పురా: ఎన్నికల్లో భాగంగా ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తానని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ పేర్కొన్నారు. నియోజకవర్గంలోని రసూల్‌పురాలోని నారాయణ జోపిడి సంఘం, సిల్వర్ కాంపౌండ్ డబుల్‌బెడ్రూం పనులను స్థానిక నాయకులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ సహకారంతో అపరిష్కృతంగా ఉన్న పనులను త్వరగా పూర్తి చేసి లబ్ధిదారులకు ఇండ్లు కేటాయించేలా చర్యలు తీసుకుంటానని హామీనిచ్చారు. కార్యక్రమంలో నాయకులు శాంసన్ రాజు, షేక్ నయిం. నాసర్, గఫార్, చాంద్‌బాషా, సలీం, బద్రీనాద్ యాదవ్, మల్లేశ్, యాదగిరి, సంతోష్ యాదవ్, రమేశ్, నగేశ్, రాజు, ప్రభాకర్, నరసయ్య, సుధాకర్, వాహేబ్, షమ్మి తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్ పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న బ్రిగేడియర్ సోమాశంకర్, సీఈవో మధుకర్ నాయక్

రసూల్‌పురా: తిరుమలగిరి చెరువులో మురుగునీరు చేరకుండా చేపట్టిన పైపులైన్ పనులను కంటోన్మెంట్ బ్రిగేడియర్ సోమశంకర్, సీఈవో మధుకర్ నాయక్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూ. 2.90 కోట్ల వ్యయంతో గత మార్చిలో పనులు చేపట్టగా 80 శాతం మేర పూర్తయినట్లు తెలిపారు. మరో నెలరోజుల్లో పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. చెరువు పరిసర ప్రాంతాలైన మలానీ ఎన్‌క్లేవ్, పద్మనాభకాలనీ, ఇండియన్ ఎయిర్‌లైన్స్ కాలనీ, సూర్య అవెన్యూ తదితర కాలనీ ప్రజలు మురుగునీరు, వ్యర్థాలు చెరువులోకి చేరి దుర్వాసన వస్తోందని తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలికి ఫిర్యాదు చేయడంతో మురుగునీరు మళ్లింపు పనులు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో బోర్డు చీఫ్ ఇంజినీర్ ఉమాశంకర్, ఏఈ దినేశ్, శానిటరీ సూపర్‌వైజర్ గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రంకన్ డ్రైవ్ కేసులో 14 మందికి జైలు

సనత్‌నగర్: బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన 15 మందిని నాంపల్లిలోని ఏడో మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ముందు శుక్రవారం హాజరుపర్చారు. ఇందులో 13 మంది రెండోసారి పట్టుబడ్డారు. వీరికి 4 రోజుల జైలు శిక్షతో పాటు రూ.3,300ల చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి స్పందన తీర్పు వెలువరించారు. అలాగే మొదటిసారి పట్టుబడ్డ ఒకరికి 2 రోజుల జైలు శిక్షతో పాటు రూ.2,100ల జరిమానా విధించారు. రెండోసారి పట్టుబడ్డ మరొకరికి 6 నెలల పాటు డ్రైవింగ్ లైసెన్స్ సస్పెన్షన్‌తో పాటు రూ.3,300ల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చినట్లు బేగంపేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పాపయ్య తెలిపారు.

సర్కారు బడులను బలోపేతం చేయాలి

లాలాపేట: గత బీఆర్ఎస్ పాలకులు ప్రైవేట్ విద్యా సంస్థలకు రెడ్ కార్పెట్ పరిచి ప్రభుత్వ విద్యా సంస్థలను పూర్తిగా నిర్వీర్యం చేశారని సీపీఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం లాలాపేటలోని నఫీజ్ గార్డెన్‌లో సికింద్రాబాద్ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సర్కారు బడులను బలోపేతం చేసి ప్రైవేట్ పాఠశాలల ఫీజుల దోపిడిని నియంత్రించాలన్నారు. దీనిపై ఈ నెల 18 నుంచి 26 వరకు ప్రభుత్వ బడుల పరిశీలన కార్యక్రమాన్ని చేపడుతామని తెలిపారు. కొమరెల్లి బాబు, గౌరీ నాగరాజు, యాకోబ్, సయ్యద్ గౌస్, హుస్సేన్, వెంకట్ తదితరులు ఉన్నారు.

బోనాలకు ప్రత్యేక నిధులు కేటాయించాలి

సికింద్రాబాద్: నగరంలో నిర్వహించనున్న బోనాల జాతరకు నిధులు కేటాయించాలని లష్కర్ జిల్లా సాధన సమితి ప్రతినిధులు కోరారు. ఈ మేరకు జిల్లా సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్‌కుమార్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి సాదం బాల్‌రాజ్‌యాదవ్ ఆధ్వర్యంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ అమ్మవారి ఆలయాలకు రూ. 25 కోట్లు కేటాయించాలన్నారు. మంత్రి సానుకూలంగా స్పందించారని సమితి ప్రతినిధులు తెలిపారు. జిల్లా సాధన సమితి ప్రతినిధులు బాబూరావు, జగదీశ్‌గౌడ్, కృష్ణముదిరాజ్, రవీందర్‌సాగర్, ఎం.జగ్గయ్య పాల్గొన్నారు.

ఓయూ కాంట్రాక్టు ఉద్యోగులను ఆదుకోవాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ కాంట్రాక్టు ఉద్యోగులను ప్రభుత్వం ఆదుకోవాలని కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ ధర్మతేజ శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. ఓయూ కంటే చిన్న యూనివర్సిటీలైన కాకతీయ, మహాత్మగాంధీ వర్సిటీల్లో కాంట్రాక్టు అధ్యాపకులు ఉద్యోగ విరమణ చేసినా, మరణించినా రూ.5 లక్షలు చెల్లిస్తున్నారని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం యూజీసీ నిబంధనలను బూచిగా చూపి వర్సిటీ కాంట్రాక్టు ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలేదని, ప్రసుత సీఎం రేవంత్‌రెడ్డి యూజీసీ నిబంధనల ప్రకారం వర్సిటీ ఉద్యోగుల విరమణ వయస్సును 65 ఏండ్లకు పెంచాలని కోరారు.

కాంట్రాక్టు ఉద్యోగులను కొనసాగించాలి

ఓయూలో పని చేసి ఉద్యోగ విరమణ చేసే అధ్యాపకులు, ఉద్యోగులను విధుల్లో కొనసాగించాలని ఉద్యోగ సంఘాల నాయకులు అధికారులను కోరారు. యూజీసీ నిబంధనల ప్రకారం కాంట్రాక్టు ఉద్యోగులకు విరమణ వయస్సు లేదని, ఆరోగ్యంగా ఉన్నంత కాలం సేవలను ఉపయోగించుకోవచ్చని అని పేర్కొన్నారు. అధ్యాపకుల కొరత తీవ్రంగా ఉన్న ఓయూలో కాంట్రాక్టు అధ్యాపకులను కొనసాగించాలని డాక్టర్. ధర్మతేజ కోరారు. అలాగే కాంట్రాక్టు ఉద్యోగుల వేతనాలు పెంచాలని, పీఆర్‌సీ అమలు చేయాలని ఉద్యోగ సంఘం నేతలు ప్రభుత్వానికి విన్నవించారు.

ఓయూలో చేగువేరా జయంతి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో చేగువేరా జయంతిని శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ఏఐఎస్ఎఫ్ ఓయూ కార్యదర్శి నెల్లి సత్య ఆధ్వర్యంలో ఆర్ట్స్ కాలేజీ ఎదుట చేగువేరా చిత్రపటానికి ఆయనతో పాటు విద్యార్థులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.